## సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

మూసాపేట: సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతి పుష్కరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పుణ్య స్నానాలు ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని అన్నారు. కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే కాలనీకే బస్సును పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8919493417 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## 28న మోతీనగర్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

మోతీనగర్: మోతీనగర్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు ఈ నెల 28న ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎంసీహెచ్ఎస్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి టి. విష్ణు వర్ధన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 21న 11 గంటలకు నామినేషన్ల పరిశీలన, 22 ఉదయం 11 గంటల నుంచి 5:30 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, గుర్తులు కేటాయించనున్నట్లు తెలిపారు.

## డ్రైనేజీలో చెత్తా చెదారాన్ని తొలగించాలి



డ్రైనేజీ వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: డ్రైనేజీలోని చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కరెంట్ ఆఫీస్ వీధిలో బుధవారం జలమండలి మేనేజర్ అన్విత్ కుమార్‌తో కలిసి భూగర్భ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారం, మట్టిని సిబ్బందితో తొలగింపజేచారు. డ్రైనేజీ నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## 22న హనుమాన్ జయంతి వేడుకలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా 22న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పి.నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామికి అభిషేకం, అర్చనలు, సహస్రనామార్చన, పంచామృతాభిషేకం, మహా నివేదన, ఊరేగింపు ఉంటాయని తెలిపారు. అదే విధంగా కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయక స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఆంజనేయ స్వామికి సుగంధ పరిమళాలతో అభిషేకం, సింధూరం పూజ, నాగవల్లి పత్రిక పూజ, విశేష పుష్పాలంకరణ, మన్యసూక్తంతో హోమం వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

## 16 నుంచి 'కిడ్స్ సమ్మర్ క్యాంప్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో కిడ్స్ సమ్మర్ క్యాంప్‌ను ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో స్వీయ చర్చా కార్యక్రమం, సృజనాత్మక ధ్యానం, విలువలతో కూడిన కార్యకలాపాలు, జ్ఞాపక శక్తిని పెంచుకోవడం, మైండ్‌ల్యాబ్, డిజిటల్ వెల్‌నెస్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9–14 ఏళ్ళ లోపు వారికి అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234, సెల్ నంబర్ 8143466670 సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం స్వప్నకు రూ.15 వేలు, తమ్మాలి నర్సింహ, మహేష్‌గౌడ్‌లకు ఒక్కొక్కరికి రూ.60 వేల చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందన్నారు. పేదలకు సంక్షేమ ఫలాలను అందించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంక్షేమ సంఘాల నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'డబుల్'.. వసూల్!

- కమిటీల పేరుతో అక్రమ వసూళ్లు
- అక్రమార్కులకు వరంగా మారుతున్న డబుల్‌బెడ్‌రూమ్‌లు
- ప్రశ్నిస్తే కరెంట్ కట్, నీళ్లు బంద్

పేద, మధ్య, తరగతి ప్రజలకు అందజేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పుడు అక్రమార్కులకు వరంగా మారుతున్నాయి. సంక్షేమ సంఘం ప్రెసిడెంట్.. వైస్ ప్రెసిడెంట్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ డబ్బులు దండుకుంటున్నారు. ఇదేమటని ప్రశ్నిస్తే 'మీకు దిక్కున చోట చెప్పుకో' అంటూ బెదిరిస్తున్నారు. కరెంట్ కట్ చేస్తున్నారు.. నీళ్లు బంద్ చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 10న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కలిసి తమ గోడును చెప్పుకుంటూ లబ్ధిదారులు కన్నీళ్ల పర్యంతమయ్యారు.



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు



డబుల్‌బెడ్‌రూమ్ సముదాయం

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలో ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ సముదాయాలను నిర్మించి లబ్ధిదారులకు కేటాయించింది. సంవత్సర కాలంగా కమిటీ పేరుతో అక్రమార్కులు అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీటిని అరికట్టాల్సిన సంబంధిత శాఖ అధికారులు అక్రమార్కులతో చెయ్యి కలిపి అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### సభ్యత్వం, మెయింటెనెన్స్ పేరిట..

బహదూర్‌పల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఉంటున్న ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ ఇక్కడ తంతు వేరేలా ఉంది. ప్రతి నెల మెయింటెనెన్స్ పేరిట వెయ్యి రూపాయలు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా తాజాగా సభ్యత్వం పేరిట రూ.1100 వసూళ్లకు శ్రీకారం చుట్టడం విశేషం. ప్రశ్నించిన వారిపై ప్రత్యక్ష దాడులకు కూడా సిద్ధపడినట్లు తెలుస్తోంది.

### 2023 నుంచి ఇబ్బందులే...

బహదూర్‌పల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు మౌలిక వసతులు కల్పించలేదు. ఇదే ఆసరాగా చేసుకొని కొంతమంది తమకు తామే కమిటీని ఎంపిక చేసుకొని ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లుగా చెలామని అవుతున్నారు. అందిన కాడికి దండుకుంటున్నారు. మొత్తం ఎనిమిది బ్లాకుల్లో 900 ఫ్లాట్లు నిర్మించారు. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా 780 ఫ్లాట్లను పంపిణీ చేసింది. నియోజకవర్గ ప్రాంతానికి చెందిన వారే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారికి సైతం ఇందులో డబల్ బెడ్ రూమ్ అందజేసింది. నాటి నుంచి నేటి వరకు తాము ఇబ్బందుల పాలవుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదని, ఇక్కడ దళారులు మా వద్ద డబ్బులు వసూలు చేసి జల్సాలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

### ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తా

బహదూర్‌పల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం గతంలో వెలుగులోకి వచ్చింది. వసూలు చేసిన డబ్బును బ్యాంకులో జమ చేయాలని సంక్షేమ సంఘం ప్రతినిధులకు చెప్పాం. అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తా. డబ్బుల విషయంపై తేడాలు వస్తే కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేస్తాం.

– సుధాకర్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ టెక్నికల్

# అన్ని హంగులతో ఫంక్షన్ హాల్ నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: అన్ని హంగులతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను అందుబాటులోకి తెస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలో నెరవేరనుందన్నారు. అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాలును అన్ని హంగులతో సకల సౌకర్యాలతో నిర్మిస్తామని తెలిపారు. ఫంక్షన్ హాలు, చిల్డ్రన్స్ పార్కు పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, పోశెట్టి గౌడ్, యాదగిరి, అగ్రవాసు, ముజీబ్, మహేష్, రవీందర్, మల్లేష్ పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తదితరులు

బాలానగర్: సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బాలానగర్ డివిజన్, రాజీవ్‌గాంధీ నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానికులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు వీలైనంత తొందరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఆశ, వాటర్‌వర్క్స్ మేనేజర్ సతీష్, రాజీవ్‌గాంధీ నగర్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి ఎంకె నరేష్, స్థానికులు షేక్ అరబ్, మహ్మద్ మోయిజ్, వినోద్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానవాటికలో అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తదితరులు

బాలానగర్: ఇందిరాగాంధీ పురం ముస్లిం శ్మశాన వాటికలో రూ.15 లక్షల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిటీ సభ్యులతో కలిసి బుధవారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫతేనగర్ డివిజన్‌లోని అన్ని శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో గౌస్, అన్వర్, షౌకత్, సలీం, సంతోష్, అస్మత్, కైసర్, అరిఫ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంప్



చందానగర్ సర్కిల్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు సందడిగా మారాయి. చిన్నారులు వివిధ క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారు. సుమారు 17 క్రీడలలో 800 మంది చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. రన్నింగ్, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్, తైక్వాండో, స్కేటింగ్, జిమ్నాస్టిక్స్, యోగా, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, క్యారమ్, బాక్సింగ్ క్రీడల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. – చందానగర్





# కేంద్రీయ విద్యాలయ@100 శాతం ఫలితాలు

'పది'లో టాపర్‌గా కార్తీక్ ఆనంద్.. 98.6 శాతం మార్కులు



రాయదుర్గం: సీబీఎస్ఈ ఫలితాల్లో గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయ వంద శాతం ఫలితాలు సాధించింది.పదవ తరగతి టాపర్‌గా కార్తీక్ ఆనంద్ 98.6 శాతం మార్కులు సాధించాడు. 10వ తరగతి, 12వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటారు. పదవ తరగతిలో మొత్తం 149 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. 37 మంది విద్యార్థులు 90 శాతం పైనే మార్కులు సాధించడం మరో విశేషం. అలాగే 12వ తరగతిలో 50 మంది విద్యార్థులు ఉండగా అందరూ ఉత్తీర్ణులయ్యారు.

### మ్యాథ్స్, సైన్స్ ఇష్టం



నాకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు అంటే చాలా ఇష్టం . ఇంటర్మీడియట్‌లో సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులను ఎంపిక చేసుకుంటా. మా తండ్రి నల్లతంబి బ్యాంకు ఉద్యోగి. కేంద్రీయ విద్యాలయలో 1వ తరగతి నుంచి చదువుతున్నాను, బోధనలో, క్రమశిక్షణ ఆచరించేలా ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ చూస్తారు. నాకు ఫుట్‌బాల్ ఆడడం చాలా ఇష్టం.

– పదవ తరగతి టాపర్ కార్తీక్ ఆనంద్

### ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల..



ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, పోటీతత్వంతో చదవడంతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం కలిగింది. పది, ప్లస్2లో 100 శాతం ఫలితాలను ఆరంభం నుంచి సాధిస్తూ వస్తున్నాం.ప్రత్యేక తరగతుల నిర్వహణ ద్వారా మంచి ఫలితాలు సాధించాం. ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంది.

– జితేంద్రకుమార్, ప్రిన్సిపాల్, కేంద్రీయ విద్యాలయ, గచ్చిబౌలి

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ నాగేశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నానక్‌రాంగూడ అపోలో ఆస్పత్రి వెనక గుర్తు తెలియని వ్యక్తి (55) చనిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీలో ఉంచారు. ఈ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడని, సంబంధిత వ్యక్తులు ఉంటే గచ్చిబౌలి పీఎస్‌లో సంప్రదించాలన్నారు. 9409061727 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ప్రత్యేక పూజలు

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని అలిమేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఊట్ల కృష్ణ, నర్సింహ యాదవ్, ఊట్ల దశరథ్, రాధాకృష్ణ యాదవ్, మాధవి, రమేష్, మణిరత్నం, ప్రసాద్ పాల్గొన్నారు.



# విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యం

తెలంగాణ 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాకేష్‌కుమార్



శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న కల్నల్ రాకేష్‌కుమార్

రాయదుర్గం: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యమని తెలంగాణ 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాకేష్‌కుమార్ పేర్కొన్నారు. గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రాంగణంలో ఎన్‌సీసీ శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం ఈ శిబిరాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమాజసేవ, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం లక్ష్యం అని అన్నారు. సైనికులకు ఇచ్చే తరహాలోనే శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణా శిబిరంలో రంగారెడ్డిజిల్లాకు చెందిన 600 మంది కాలేజీ విద్యార్థులు, 12 పాఠశాలలకు చెందిన క్యాడెట్లు పాల్గొంటున్నారన్నారు. ఈనెల 17వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మణ్, గణేష్, సబ్ మేజర్ కిషోర్‌సింగ్ ఏఎన్ఓ ఆఫీసర్లు, సైనిక సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐలకు సెక్టార్ల కేటాయింపు

కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో ఉన్న ఐదు సెక్టార్లకు బదులు మరో సెక్టార్‌కు అదనంగా ఏర్పాటు చేసి ఎస్ఐలకు సిఐ విజయవర్ధన్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల జరుగుతున్న దొంగతనాలు, ఇతర చిల్లర గొడవలు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు వెంటనే తెలియపరిచే విధంగా సెక్టార్ ఎస్ఐలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా సంక్షేమ సంఘాల వారితో మమేకమై రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 తో పాటు ఎస్ఐలకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ –87126 63248, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే విజయ వర్ధన్–9490617229, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్–8712663249.

**సెక్టార్ల వారీగా ఎస్ఐల ఫోన్ నంబర్లు**

సెక్టర్–1 ఎస్ఐ సి.నర్సింహులు– 949021 3722,
సెక్టార్–2 ఎస్ఐ లావణ్య – 8712568342,
సెక్టార్ –3 ఎస్ఐ ధర్మేష్ –8712568129,
సెక్టార్–4 ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి–8712568384,
సెక్టార్ –5 ఎస్ఐ సురేందర్ రెడ్డి–8712568203,
సెక్టార్–6 ఎస్ఐ నరసింహులు గౌడ్–8712568146

ఫోన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయా సెక్టార్ల వారీగా సమస్యలు ఉంటే నేరుగా ఎస్ఐలకు ఫోన్ చేసి సమస్యను వివరించవచ్చని పేర్కొన్నారు.

# నిధులన్నీ 'చెరువు' పాలు

మీదికుంట చెరువు అభివృద్ధికి రూ. 1. 70 కోట్లు మంజూరు

- ఏప్రిల్ 30- 2022న శంకుస్థాపన
- కేవలం 10 రోజులే పనులు చేసి వదిలేసిన వైనం
- నిధులు గోల్‌మాల్ అంటూ ఆరోపణలు

మియాపూర్: మీదికుంట చెరువు అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరైనా ఫలితం లేకుండా పోయింది. 3 సంవత్సరాలు గడిచినా పనులు ముందుకు సాగలేదు. శంకుస్థాపన చేసిన తర్వాత కొంత మేర పనులు చేపట్టి వదిలేశారు. చెరువు అభివృద్ధికి కేటాయించిన నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మియాపూర్‌లోని చెరువులకు కోట్ల రూపాయల నిధులు కేటాయించి కొంత మేర పనులు చేపట్టి వదిలేశారు. మరలా సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధికి ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. మొదట కేటాయించిన నిధులు ఎటు పోయాయని సర్వత్రా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎన్‌క్లేవ్ వద్ద మీదికుంట చెరువు సుందరీకరణ పనులు మూడు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. దీంతో చెరువులో గుర్రపుడెక్క, మురుగునీరు, పిచి చ్చిమొక్కలతో అధ్వానంగా తయారైంది.
- చెరువు సుందరీకరణ పనులకు రూ.1కోటి 70లక్షలు కేటాయించి ఈ పనులకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఏప్రిల్ 30– 2022న సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.
- కొన్ని రోజుల పాటు చెరువు చుట్టు వ్యర్థాలను తొలగించి కొంతమేర మట్టితో చెరువుకట్టగా వేసి వదిలేశారు. 10 రోజుల పాటు పనులు చేపట్టి మధ్యలోనే పనులు వదిలేశారు
- చుట్టుపక్కల కాలనీల నుండి వచ్చిన మురుగు చెరువులో చేరుతూ దుర్గంధం వెదజల్లుతుంది. దీనితో పాటు చెరువులో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగాయి.
- మీదికుంట చెరువు గతంలో విస్తీర్ణానికి, ప్రస్తుతం చెరువు సుందరీకరణ పనులు చేపట్టిన విస్తీర్ణానికి చాలా వ్యత్యాసం ఉందని స్థానికులు అంటున్నారు. చెరువును సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేసి పనులను చేపట్టాలని అంటున్నారు. కానీ అధికారులు నామమాత్రంగా సర్వే చేపట్టి కబ్జాలు తొలగించకుండానే చుట్టు మట్టి వేశారని పేర్కొంటున్నారు.

### నగంసగం పనులు..

మొదట చెరువుల అభివృద్ధి పేరిట కోట్ల రూపాయలు మంజూరు చేసి కొంతమేర పనులు చేసి వదిలేస్తున్నారు. రెండు,మూడు సంవత్సరాలు గడిచాక మరలా చెరువుల అభివృద్ధి పేరిట సీఎస్ఆర్ నిధులతో చేపట్టేందుకు ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారు. మొదట కేటాయించిన నిధుల సంగతేంటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంజురైన నిధులకు, చేసిన పనులకు ఎక్కడా పొంతన లేదని అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతుంది.

### నాలా కబ్జా

మియాపూర్‌లోని మీదికుంట చెరువు నుండి మక్త మహబూబ్‌పేట పెద్దకుడి చెరువుకు వెళ్లే నాలా ఆక్రమణలకు గురైందని స్థానికులు తెలిపారు. కొంతమంది నాలాను కబ్జా చేసి మలుపులుగా మళ్లించడంతో 30 ఫీట్లు ఉండాల్సిన నాలా 10 ఫీట్లకే పరిమితమైంది. అధికారులు కూడా ఈ నాలను 10 ఫీట్ల వరకే బాక్స్ నాలాగా నిర్మాణ పనులు చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి నాలా, చెరువును సర్వే చేయడంతో బాటు అభివృద్ధి పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మీదికుంట చెరువులో గుర్రపుడెక్క, కలుపు మొక్కలు, చెత్తాచెదారం

